## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

**మల్లాపూర్:** నాచారం ఓల్డ్ విలేజ్‌కు చెందిన అశోక్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సీఎం రిలీఫ్‌ఫండ్ కింద దరఖాస్తు చేసుకోగా.. రూ.25వేలు మంజూరయ్యాయి. మంగళవారం చెక్కును బాధితుడికి కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అందజేశారు. బీఆర్ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, భూపాల్‌రెడ్డి, కొత్త విజయ్‌చందర్‌గౌడ్, గణేష్ తదితరులున్నారు.

## సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శిగా యాదయ్య



**గౌతంనగర్:** సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శిగా గౌతంనగర్ డివిజన్ ఇందిరా నెహ్రూనగర్‌కు చెందిన యాదయ్యగౌడ్ నాల్గోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్ నియామక ఉత్తర్వులు జారీచేసినట్లు యాదయ్యగౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో సీపీఐ పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానన్నారు.

## వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



**శామీర్‌పేట్:** నేటి నుంచి మూడ్రోజుల పాటు ఉద్దమర్రి విష్ణు, శివాలయ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి విష్ణు, శివాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ విష్ణు, శివకేశవుల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



**ఘట్‌కేసర్:** ఏదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ వెంకట్‌రెడ్డి, డీఏఓ చంద్రకళ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని పరిశీలించి రైతులు, స్థానిక అధికారులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జ్‌ని ఆదేశించారు. ధాన్యంలో తేమ, తాలు, దుమ్ము, మట్టి పెడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు వాతావారణ సమాచారం ఇవ్వాలని సూచించారు.

**మేడ్చల్:** మేడ్చల్‌లో ప్రభుత్వం తరుపున నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ వెంకట్‌రెడ్డిలు అధికారులతో కలిసి సందర్శించారు. కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తగినంత హమాలీలను ఏర్పాటు చేయాలని, వడ్లు దింపే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైతులు అమ్మిన ధాన్యం డబ్బులు 48 గంటలలోగా వారి ఖాతాలో జమచేస్తున్నట్లు తెలిపారు. డీఏఓ చంద్రకళ, ఏఈఓ సుమిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలి

**బోడుప్పల్:** వాసవీనగర్ కాలనీలో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి కాలనీవాసులకు తాగునీటిని సరఫరా చేయాలని కమిషనర్‌కు స్థానికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో పాత పైపులైన్లు ఉండటంతో తరుచుగా పగిలిపోతున్నాయని, దీంతో వీధి నంబరు 6లో తాగునీరు సరిగ్గా రావడం లేదని వాపోయారు. దీనిపై పలుమార్లు జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా వాటర్‌పైపులైన్ లేకపోవడంతో పాటు తరుచుగా లీకేజీలు అవుతున్నాయన్నారు. కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరమ్మతులు చేపట్టాలని కమిషనర్‌ను వినతిపత్రంలో కోరారు. కాలనీ ఉపాధ్యక్షుడు కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# చెరువులోకే మురుగు !

● గత రెండేళ్లుగా చేరుతున్న డ్రైనేజీ నీరు ● జలమండలి వైఖరిపై సర్వత్రా విమర్శలు

**రామంతాపూర్ :** ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు హైడ్రాను ఏర్పాటు చేయడమే కాకుండా చెరువుల స్థలాలు కబ్జా, మట్టి నిర్మాణ వ్యర్థాలు, మురుగునీరు చేరితే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా.. అమలుకు నోచుకోవడం లేదు. హైడ్రా కమిషనర్ హెచ్చరించిన ఉప్పల్ సర్కిల్ జలమండలి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కాలుష్యకాసారాలుగా..**

రామంతాపూర్‌లో పలు కాలనీలు, బస్తీల మధ్య చిన్న చెరువులోకి చెరువు సమీపంలో ఉన్న మార్కండేయ దేవస్థానం వద్దఉ న్న భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి గత రెండేళ్లుగా భారీ ఎత్తున మురుగు వచ్చి చెరువులో చేరుతోంది. దీంతో చెరువు నీరు కాలుష్యకాసారంగా మారింది. చెరువు సమీపంలో ఉన్న పలు కాలనీలు, బస్తీల్లో దోమలు విజృంభించి ప్రజలు అంటువ్యాధుల భారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పలుసార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**హైడ్రా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం**

రామంతాపూర్ చిన్న చెరువులో గత రెండేళ్లుగా భారీఎత్తున మురుగు చేరుతున్న పట్టించుకోని జలమండలి అధికారులపై హైడ్రాలో ఫిర్యాదు చేస్తామని, స్థానికులందరూ హైడ్రా పోలీస్‌స్టేషన్ ఫోన్‌నెంబర్ 9000113667 ఫిర్యాదు చేయాలని స్థానిక బస్తీల కాలనీల సంక్షేమ సంఘం నేతలు చెబుతున్నారు.



మురికి కూపంగా మారిన చిన్నచెరువు

**పూడికతీత పనులు చేపట్టాలి**



రామంతాపూర్ చిన్న చెరువులో భారీఎత్తున డ్రైనేజీ, మురుగు వచ్చి చేరుకున్న జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చెరువు కాలుష్యకాసారంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీరు చెరువులోకి రాకుండా తగిన చర్యలు తీసుకుని పూడికతీత పనులు చేపట్టాలి.

– మల్లయ్య, గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు



మ్యాన్‌హోల్ నుంచి మురుగు చెరువులోకి వచ్చి చేరుతున్న దృశ్యం

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశాల నిరసన



అల్వాల్ పీహెచ్‌సీ వద్ద నిరసన చేస్తున్న ఆశావర్కర్లు

**అల్వాల్:** దేశవ్యాప్త నిరసనలో భాగంగా అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఆశా యూనియన్ కమిటీ సభ్యులు కోమలత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం బడ్జెట్ పెంచాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశం..

**అల్వాల్:** అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారి పనితనం, ప్రజాభిప్రాయసేకరణ టార్గెట్‌లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గర్భిణులు, పలువురిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. సూపర్‌వైజర్లు మరియరాణి, జగన్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు అభివృద్ధికి సహకరించండి

**మల్కాజిగిరి:** సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి సహకరించాలని, లేదంటే నిరాహారదీక్షకైనా సిద్ధమవుతానని, మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం సర్కిల్ డీసీని కలిసిన అనంతరం మాట్లాడుతూ.. చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోతుందని, తొలగించేందుకు రాంకీ వాహనాలు రావడం లేదన్నారు. యూజీడీ నిర్వహణ జలమండలి విభాగం పరిధిలో ఉందని, సమన్వయం చేసి చెరువులోకి మురుగు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆటవస్తువులు దెబ్బతిన్నాయని, చెరువు వద్ద అభివృద్ధి పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయన్నారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల నుంచి సరైన స్పందన రాలేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే నిరాహారదీక్ష చేయడానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు. విజయకుమార్, జోగు వెంకటేష్, శ్రీనివాస్, నరేందర్, వీరేశంయాదవ్ పాల్గొన్నారు.



డీసీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

## సీసీరోడ్డు పనుల పరిశీలన

**మల్లాపూర్:** కాప్రా సర్కిల్‌లోనే మల్లాపూర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ కేఎల్‌రెడ్డినగర్‌లో రూ.65 లక్షలతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. డివిజన్‌లో మెయిన్‌రోడ్డుతో పాటు అంతర్గత రోడ్లకు కుడా సీసీ వేయిస్తున్నామని తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామారావు, కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకుబ్‌రెడ్డి, వాసుగౌడ్, పీఆర్.ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, రవిచారి, ప్రవీణ్, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కేఎల్‌రెడ్డినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

# లేబర్‌కోడ్‌లను ఎత్తివేయాలి



నిరసన చేస్తున్న సీఐటీయూ నేతలు

**మల్లాపూర్:** 4 లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలని సీఐటీయూ నాచారం కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నాచారం పారిశ్రామికవాడలోని వాయిత్ టర్బో కంపెనీ వద్ద కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. లేబర్‌కోడ్ వల్ల కార్మికులకు భద్రతా సౌకర్యాలు భవిష్యత్తులో ఉండవన్నారు. 8 గంటల పనివిధానం పోయి, 12 గంటల విధానం అమలులోకి వస్తుందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సత్యంగౌడ్, శ్రీనివాస్, అలీ,సుభాన్, నరసింగరావు, రాజు, వెంకటేష్, గోపాల్, సుధాకర్, బాలరాజ్, నర్సింగ్‌రావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం

**మల్కాజిగిరి:** మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటలకు వాహనాల వేలంపాట జరుగుతుందని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 5 ద్విచక్రవాహనాలు, 3 కార్ల వేలంపాట జరుగుతుందని, పాల్గొనే వారు రూ.2000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## హత్య కేసు నిందితుడి రిమాండ్



**మేడ్చల్:** మంచి మాటలు చెప్పినందుకు ఆవేశంతో వరుసకు బావైన వ్యక్తి నడిరోడ్డుపై కిరాతకంగా కత్తితో పొడిచిన వ్యక్తిని మేడ్చల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ సరస్వతీనగర్‌లో నివాసం ఉండే మోతిలాల్‌ను అదే కాలనీకి చెందిన శంకర్‌గుజరాతి సోమవారం కత్తితో పొడిచాడు.. నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ స్థలం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**సాక్షి,సిటీబ్యూరో:** మేడిపల్లి మండలంలో కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల కోసం రజకులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో రాత్రికి రాత్రి గుడిసెలు వేసి రేవంత్‌రెడ్డి పేరు పెట్టి యదేచ్ఛగా కబ్జాలకు పాల్పడటం దారుణమని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. ఈ కబ్జాల వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మేడిపల్లి మండల పరిధిలోని మేడిపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 103లో రజకుల ఆత్మగౌరవ భవనం కోసం 2018లో 2.20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ.. గత ప్రభుత్వం జీవో నెంబర్ 20ను విడుదల చేసిందన్నారు. ఆ స్థలాన్ని రజకుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించడానికి పరిరక్షించాలని ఆయన కోరారు.

**మెట్రోచార్జీలు తగ్గించాలి..**

**సాక్షి,సిటీబ్యూరో:** హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వాహకులైన ఎల్అండ్‌టీ యాజమాన్యం ఇటీవల భారీగా పెంచిన మెట్రోచార్జీలను రద్దు చేయాలని సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. మెట్రో రైలు ప్రారంభానికి ముందు ఎల్అండ్‌టీ యాజమాన్యం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందానికి అదనంగా ఇప్పటికే చార్జీలు వసూలు చేస్తుందన్నారు. ప్రయాణికులపై ఇప్పటికే తీవ్రమైన భారం పడుతుందని, ఇలాంటి నేపథ్యంలో చార్జీలు పెంచడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 269 ఎకరాల భూమిని ఎల్అండ్‌టీ యాజమాన్యానికి ఇచ్చిందని, దీన్ని వ్యాపారీకరించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. రైలు బోగీలను పెంచడం ద్వారా అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు తగ్గిన విషయాన్ని గమనించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని పెంచిన మెట్రోచార్జీలను తగ్గించాలని కోరారు.

# రోడ్డు విస్తరణను తగ్గించండి

అల్వాల్ గ్రామసభలో బాధితులు

**అల్వాల్:** రాజీవ్ రహదారి విస్తరణను తగ్గించాలని బాధితులు అధికారులను కోరారు. రాజీవ్ రహదారి సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపులా స్థల సేకరణను ప్రభుత్వం చేపట్టింది. మంగళవారం అల్వాల్ ఐటీఐ గ్రౌండ్‌లో అధికారులు గ్రామసభ నిర్వహించారు. సభకు హాజరై స్థలం కోల్పోతున్న బాధితులు మాట్లాడుతూ.. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలం కోల్పోవడం వల్ల భవిష్యత్తు పూర్తిగా అంధకారం అవుతుందన్నారు. దీనికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 200 అడుగుల రోడ్డు విస్తరణను పునరాలోచించుకుని, రోడ్డు విస్తరణ పరిమాణం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు స్పష్టం చేశారు. బాధితుల అభిప్రాయాలను ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, హెచ్ఎండీఏ అధికారి వినోద్, ఆర్డీఓ శ్యామ్‌ప్రసాద్, అల్వాల్ మండల తహసీల్దార్ రాములు, అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి, రాజీవ్ రహదారి ప్రాపర్టీ జేఏసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ హరిప్రియకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

# ఉప్పల్ బైపాస్‌తో తొలగనున్న ట్రాఫిక్ సమస్య

**ఉప్పల్:** ఉప్పల్ మెట్రో క్యాష్ అండ్ క్యారీ నుంచి ఏషియన్ థియేటర్ వరకు రోడ్డు పనులు త్వరలో పూర్తికానున్నాయని, కార్పొరేటర్ మందముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఉప్పల్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ భారం తగ్గనుందన్నారు. ఏఈ మౌనిక, స్థానికులు అంజిరెడ్డి, రత్నం, చంద్రారెడ్డి, బిక్షపతి, సత్తిరెడ్డి, మల్లేష్, రాజేందర్‌రెడ్డి, లావణ్య, సునీత తదిరులున్నారు.



పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

# కొనసాగుతున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

**కీసర:** 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా కీసరలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాధవిలత, సందీప్, విక్రమ్, నిహారిక, ఏఈఓ రాజ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. చీడపీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రసాయన మందులను తక్కువ మోతాదులో వాడాలని సూచించారు. ఉద్యాన పంటలపై తీసుకోవాల్సిన మెళుకువల గురించి చెప్పారు.



సోమారం సదస్సులో రైతులకు సూచనలు ఇస్తూ..

**మేడ్చల్:** మండలంలోని సోమారం గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఆధునిక వ్యవసాయం, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, సేంద్రియ ఎరువుల వాడకం, భూసారానికి తగినట్లుగా పంటలసాగు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సుధాన్షు, డాక్టర్ స్వామి, ఏఈఓ తేజస్విని రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి



జలమండలి జీఎం సునీల్‌తో కార్పొరేటర్ సునీత

**అల్వాల్:** గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ సునీత జలమండలి జీఎం సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. పలు కాలనీలో పవర్‌బోర్లు పాడై నీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటికి మరమ్మత్తులు చేసి ప్రజలకు నీరు అందేలా చూడాలని కోరారు. పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పైపుల నిర్మాణాలు చేపట్టి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని విన్నవించారు. నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**మౌలాలి:** డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ ఏఈ మధురిమతో కలిసి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డివిజన్‌లో నెలకొన్న ప్రజాసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకుడు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.



ఏఈ మధురిమతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్

# భారీగా గంజాయి పట్టివేత

● ఒడిశా, ఆదిలాబాద్ మీదుగా పూణెకు సరఫరా
● ఐదుగురి అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు



మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ

**పోచారం:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ చెప్పారు. సోమవారం రాత్రి ఘట్‌కేసర్‌లోని ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. గంజాయి తరలిస్తున్న వాహనం పట్టుబడింది.మంగళవారం నారపల్లిలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు వివరాలను వెల్లడించారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేస్తుండగా.. ఔటర్‌రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద కర్ణాటకకు చెందిన ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. కారులోని ఐదుగురిని అదుపులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా డిక్కీలో గంజాయి ప్యాకెట్లు లభించాయి. వీటి మొత్తం బరువు సుమారు 59 కిలోలు ఉంటుంది. సుమారు రూ. 23.55 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితులు బీదర్‌కు చెందిన గోవింద్ తాపసలే (36), గజానంద్ (21), పవన్ (25), ఆకాశ్ (32), ఆదిలాబాద్‌కు చెందిన తోరత్ రాహుల్ (31)గా గుర్తించారు. వీరంతా కలిసి బీదర్ నుండి ఒడిశాలోని గజపతి జిల్లాలో ఉన్న సుమన్ జన్ని వద్దకు వెళ్లి, అక్కడ ఎండు గంజాయిని కిలో రూ. 1900 లకు కొనుగోలు చేసి కారులో భద్రాచలం, సూర్యాపేట, పంతంగి టోల్‌ప్లాజా నుంచి ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ టోల్‌ప్లాజా ద్వారా రవాణా చేస్తుండగా.. పోలీసులకు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా పూణెలో ఉంటున్న అభిషేక్‌కు కిలో రూ. 5 వేలు చొప్పున రాహుల్ ద్వారా బీదర్‌కు చెందిన వ్యక్తులు అందజేయడానికి ఒప్పందం చేసుకున్నారు. నిందితుల వద్ద లభించిన గంజాయితో పాటు రూ. 5 లక్షల విలువైన కారు, రూ. 50 వేలు ఖరీదు చేసే 5 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమన్ జన్నీ, అభిషేక్ పరారీలో ఉన్నారు. తనిఖీలను చాకచక్యంగా నిర్వహించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ జూపల్లి రవి, ఇన్‌స్పెక్టర్ సంగీత, ఎస్సై నందిని, ఇతర సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఎక్సైజ్‌శాఖ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ముకుందంరెడ్డి పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

పలు టిప్పర్లకు జరిమానా

**శామీర్‌పేట్:** అక్రమంగా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి హెచ్చరించారు. మేడ్చల్‌జిల్లా, మూడుచింతలపల్లి మండలంలో అక్రమంగా మట్టితరలిస్తున్న టిప్పర్ లారీలను మండల రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి పట్టుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. కాగా తహసీల్దార్ 2 లారీలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. అనుమతులు లేకుండా మట్టితవ్వకాలు, రవాణ చేస్తే వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.